క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో భూసారం



శిక్షణలో సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల ద్వారా భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం ఎం.ఆనందరావు పేర్కొన్నారు. మండలంలోని కొత్త పాలెంలో సీహెచ్ కాసులమ్మ ఫీల్డ్‌లో నిర్వహిస్తున్న మెంటల్ శిక్షణ తరగతులను గురువారం డీపీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రి ఫారెస్టు విధానం ద్వారా భూముల్లో, గట్లుపై ఏఏ పంటలను ఏ విధంగా సంవత్సరం పొడవునా సాగు చేయవచ్చో వివరించారు. భూసారం పెరగడం వలన పర్యావరణాన్ని కూడా కాపాడటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం శాస్త్రవేత్త ఎం.కిషోర్ కుమార్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ జయంతి

దత్తిరాజేరు : చిన్న చిన్న విషయాల్లో గొడవలు పడి పోలీస్‌స్టేషన్, కోర్టులు చుట్టూ తిరగకుండా తగాదాలకు దూరంగా ఉండాలని పెదమానాపురం ఎస్‌ఐ జయంతి అన్నారు. దత్తి గ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నతంగా చదివి మంచిగా స్థిరపడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మైనర్లు వల్లే జరుగుతున్నాయని మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహన చోదకుడు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

డెడ్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో కల్యాణి ప్రతిభ



రేణుకాకల్యాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.రేణుకాకల్యాణి డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభను చాటింది. ఈ నెల 2వ తేదీన విశాఖపట్నం జిల్లా గాజువాక పెద్ద గంట్యాడలో జరిగిన 4వ ఏపీ స్టేట్ డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్ స్పోర్ట్సు మీట్‌లో పవర్ లిఫ్టింగ్ 84కేజీల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. అదే విధంగా ఏడవ ఏపీ స్టేట్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 57 కేజీల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. రేణుకాకల్యాణిని కళాశాల ప్రిన్సిపాల్ అండ్ సెక్రటరీ బి.రవి, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

షిర్డీ సాయిబాబా పీఠం వార్షికోత్సవం



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల షిర్డీ సాయిబాబా పీఠం 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అంపోల ఉమామహేశ్వరశర్మ, కిరణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజపతినగరం: గజపతినగరం మండలం చల్లపేట ఫీడర్ విద్యుత్ మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మలను తొలగించనుండడంతో దిగువన ఉన్న బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం ఏర్పడనుంది. అలాగే కెంగువ ఫీడర్ మీద ఉన్న లింగాలవలస గ్రామం వద్ద రోడ్డు వైండింగ్ చేయడం వలన లింగాలవలస గ్రామానికి శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ.అనంతరావు గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆ 'పల్లె'లకు 'పండగ' లేదా..!

- రహదారి నిర్మాణం, మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- వేల మంది అవస్థలు పట్టని కూటమి పాలకులు
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- నెలలు గడుస్తున్నా...ముందుకెళ్లని పనుల



వేపాడలో రోడ్డు విస్తరణ కోసం తొలగించిన ఇళ్లు



సీతంపేట వద్ద రాళ్లు తేలిన వేపాడ - సోంపురం రహదారి

శృంగవరపుకోట: 'సంక్రాంతి నాటికి గోతుల్లేని రహదారుల నిర్మాణమే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం..' అంటూ గొప్పలు చెప్పిన కూటమి పాలకులు నేడు ఆ మాటలను గాలికొదిలేశారు. దీంతో పలు రహదారులు ప్రయాణికులకు శాపంగా మారాయి. పల్లె పండగ పేరుతో సంక్రాంతి లోపు రహదారుల మరమ్మతులు, నిర్మాణాలు పూర్తి చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో గొప్పలు చెప్పిన కూటమి నేతలు రహదారుల తీరు మారకపోయినా.. పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మండలంలో పలు గ్రామాలకు.. సుమారు 50 వేల మంది జనాభాకు ఏకైక దారి సోంపురం - వేపాడ రహదారి. ఈ రహదారి అధ్వానంగా మారినా పాలకులు పట్టించుకోవడం లేదు. కూటమి సర్కారు కొలువు దీరి తొమ్మిది నెలలు గడిచినా వేపాడ రోడ్డు ఊసెత్తలేదు. దీంతో వేపాడ మండలంలోని సుమారు 20 పంచాయతీల పరిధిలో నివాసితులు రహదారి కష్టాలు పడుతున్నారు. రోడ్డు అభివృద్ధి చేస్తున్నామంటూ.. ఉన్న రోడ్డును పీకేశారు. దీంతో రోడ్డంతా గోతుల మయమై.. దుమ్ము రేగి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి ప్రయాణమైతే ప్రమాదకరంగా తయారైంది.

వేపాడ వాసుల వెతలు

మండల కేంద్రమైన వేపాడ వాసులు ఏడాదిగా నరకం అనుభవిస్తున్నారు. వీరితో పాటూ ఆ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. రోడ్డు వెడల్పు చేస్తున్నాం అని ముందుగానే ఇళ్లు కొట్టేసి, ఉన్న డ్రైన్‌లు పీకేశారు. దీంతో రోడ్డు అంతా మట్టి రాళ్లతో నిండిపోయింది. ఇళ్లలోని వాడుక నీరు పోయే దారి లేక రోడ్డుపైకి వస్తోంది. ఇళ్ల మరమ్మతులు చేసుకోలేక, మెట్లు కట్టుకోలేక, బైక్‌లు వంటివి ఇళ్లలోకి పట్టుకెళ్లే అవకాశం లేక ప్రధాన రహదారిలో నివాసం ఉన్న వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణలో కావాల్సిన మేర స్థలం తీసుకుని రోడ్డు పూర్తయితే ఇళ్లకు మరమ్మతులు చేసుకోవచ్చని ఏడాదిగా ఎదురు చూస్తున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు.

తరచూ ప్రమాదాలు

వేపాడ రోడ్డు పనులు పూర్తి చేయడంలో ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేపాడ - సోంపురం గ్రామాల మధ్య కొన్ని బిట్లు బీటీ వేసి రోడ్డు పూర్తి చేశారు. కాగా మధ్యలో కల్వర్టులు ఉన్న చోట, వదిలేశారు. దీంతో అక్కడి వరకూ రోడ్డు క్లియర్‌గా ఉందని వేగంగా వచ్చిన వాహనాలు ఒక్కసారిగా ఎగిరిపడుతున్నాయి. అలవాటు లేని వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టు నిర్మాణంలో ఉందని, లేదా రోడ్డు మరమ్మతుల్లో ఉందన్న హెచ్చరికల బోర్డులు కూడా లేవు. భారీ వాహనాలు ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించటంతో ఇళ్లు, ఒళ్లు, కళ్లు అంతా దుమ్మే. రోడ్డుపై రేగుతున్న దుమ్ముతో రోగాల పాలవుతున్నామని, వేసవి ఎండలు ఎక్కువ కావటంతో ఈ దుమ్ము బాధ మరింతగా పెరిగిందని జనం వాపోతున్నారు. మండలానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమి నాయకులు అంతా నిత్యం తిరుగుతున్నా వాళ్లెవరికీ ప్రజల పాట్లు పట్టటం లేదని, ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే అయిన లలితకుమారికి వేపాడ అక్కరలేని మండలంగానే కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలాఖరు నాటికి...

మార్చి నెలాఖరు నాటికి పనులు ప్రారంభమవుతాయి. కాంట్రాక్టర్‌కు ఇటీవల చేసిన పనుల మేరకు బిల్లులు చెల్లించాం. పనులు ప్రారంభించాలని అడిగాం. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి.

– స్వామి, జేఈఈ

క్రాస్‌తో నీటి ఎద్దడి నివారణ



క్రాస్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): నీటి ఎద్దడి నివారణకు సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకుగాను మరమ్మతులకు చేరుకున్న వాటిని బాగు చేయించి నీటిని అందిస్తారని తెలిపారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.ఈశ్వరరావు, ఏఓ మధుసూదనరావు, బోరు మెకానిక్‌లు ముల్లు కృష్ణమూర్తి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచు తెరలు



గజపతినగరం పరిసర ప్రాంతాలలో కురిసిన మంచు

గజపతినగరం : గజపతినగరం పరిసర ప్రాంతాలలో గురువారం ఉదయం కురిసిన మంచుతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టపగలు కురుస్తున్న మంచు వల్ల విజయనగరం నుంచి సాలూరు వైపు వెళ్తున్న వాహనాలు, సాలూరు నుంచి విజయనగరం వైపు ఎదురెదురుగా ప్రయాణిస్తున్న వాహనదారులు అవస్థలు పడ్డారు. ఉదయం 10గంటల వరకు మంచు కురవడంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చి మొక్కజొన్న పంటకు చీడపీడలు సోకి, మామిడి పంట పూత దెబ్బతినే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం

బొండపల్లి: మండల కేంద్రంలో కొలువైన ఎల్లమ్మ తల్లి పండగ సందర్భంగా సిరిమానోత్సవాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు సిరిమానును గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఎల్లమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పెద్దలతో పాటు గెద్దపేట, చందకపేట గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం అంగరంగ వైభవంగా సిరిమానును పూజారి అధిరోహించగా సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

విద్యార్థి భవిష్యత్‌కు టెన్త్ తొలి మెట్టు



కొత్తవలస కేజీబీవీలో టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేత

లక్కవరపుకోట/కొత్తవలస : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు టెన్త్ తొలి మెట్టు అని ప్రముఖ వైద్యులు, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తెన్నేటి సుబ్బారావు అన్నారు. లక్కవరపుకోట, కొత్తవలస మండలాల్లోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్షల సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి సత్ఫలితాలు సాధించాలన్నారు. ఎల్.కోట, కొత్తవలస కేజీబీవీల ప్రత్యేక అధికారులు ప్రవీణ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం ప్రచారం



ఎస్.కోట బాలికోన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ప్లస్ టూ గరల్స్ (బాలికల జూనియర్ కళాశాల)లో చేరాలని కోరుతూ ధర్మవరం ఉపాధ్యాయులు గురువారం ఎస్.కోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినిలతో సమావేశం అయ్యారు. ఎంఈఓ బి.నర్సింగరావు, హెచ్.ఎం విజయలక్ష్మి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మవరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ బాలికల జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, టెక్నో ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, క్రీడా మైదానం వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. బాలికల చదువును ప్రోత్సహించటం కోసం ధర్మవరంలో ఉన్న జూనియర్ కళాశాలలో జాయిన్ కావాలని కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



కొత్తకర్ర గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి హైమావతి

మెరకముడిదాం:

మండలంలో 270 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేసినట్టు మండల పశువైద్యాధికారిణి సిహెచ్.హైమావతి స్పష్టం చేశారు. మండలంలోని కొర్లాం, కొత్తకర్ర గ్రామాల్లో పశువైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. శిబిరాల్లో మొత్తం 270 పశువులకు బ్రుసెల్లోసిస్ టీకాలు, గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువుల్లో కనిపించే లక్షణాలు గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా పాడి పశువులకు ఈ టీకాలను వేయడం వల్ల పాల దిగుబడి నిలకడగా ఉంటుందన్నారు. సక్రమంగా మేత మేస్తాయని తెలిపారు. పశు వైద్య సిబ్బంది తమ సేవలు అందించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి : ఎంపీపీ



జెండా ఊపి క్రాస్ పోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం క్రాస్ ప్రోగ్రాంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను క్రాస్ పోగ్రాంలో బాగు చేయాలని తెలిపారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఏ గ్రామం నుంచి ఫిర్యాదులు రాకూడదన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఆర్.వెంకటేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు, ఏఓ రాములమ్మ, పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోరు బావికి మరమ్మతులు

మెరకముడిదాం: మండలంలోని ప్రారంభమైన క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా భైరిపురం గ్రామంలో ఉన్న నాలుగు బోరు బావులను ఆర్‌డబ్ల్యూఎస్ బోరు మెకానిక్‌లు కె.దేవుడు, ఎం.శ్రీనివాసరాజు, జోగారావు గురువారం మరమ్మతులు చేశారు. గ్రామంలో మిగిలిన బోరు బావులు పరిశీలించి బాగానే ఉన్నట్టు గుర్తించారు.

గడువు పెంపు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ యు.ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన గడువు గురువారంతో ముగియటంతో ప్రభుత్వం మార్చి 13 వరకు గడువు పెంచిందన్నారు. ఆసక్తి వున్న విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల పని చేసే సమయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

కాయ దశలో మామిడిని కాపాడుకోవాలి



మామిడి తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కీటక శాస్త్రవేత్త, ఉద్యానవన శాఖాధికారి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కాయ దశలో ఉన్న మామిడి పంటను వ్యాపిస్తున్న కీటకాల నుంచి కాపాడుకోవాలని నూజివీడు కీటక శాస్త్రవేత్త జి.శాలిరాజు రైతులకు సూచించారు. గరివిడి మండలంలోని కాపుశంబం, ఐతాంవలస గ్రామాల్లో మామిడితోటలను ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్‌తో కలిసి ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పణుకులు ఎదుగుతున్న కాయదశలో ఉన్నాయని, చెట్టుకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల పొటాష్ చొప్పున ఎరువు వేసి నీటిని పెడితే కాయసైజు పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా సువర్ణరేఖ మామిడి నిమ్మకాయ సైజు పరిమాణం దాటి ఉందని, 13.0.45 ఎరువును లీటర్ నీటికి 5–10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సువర్ణరేఖ చెట్టుకు కూడా పణుగుల మాదిరిగానే ఎరువుతో కూడిన నీటి తడిని పెట్టాలని సూచించారు. బంగినపల్లి నిమ్మకాయ సైజులో ఉందని, తామరపురుగు వ్యాపించే అవకాశం ఉన్నందున పురుగు నివారణకు ఇమిడోక్లోప్రైడ్ 0.3 మి.మీ లేదా థియోమిథాక్సామ్ 0.3 గ్రాముల రసాయనిక మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పండు ఈగ నివారణకు పండు ఈగ బుట్టలు(లింగార్షక) ఎకరానికి 4–5 చొప్పున పెట్టుకుని వాటి ఉనికిని గమనించాలని సూచించారు.

వేడుకగా రామాలయం వార్షికోత్సవం



బొండపల్లి మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో సీతాసమేత రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణస్వామి విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– బొండపల్లి

జెడ్పీ చైర్మన్ పరామర్శ



సతివాడ మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పొట్నూరు సూర్యనారాయణ సతీమణి, పాలవలస సర్పంచ్ పొట్నూరు కనకమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు కనకమ్మ పార్థివ దేహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీపీ పొట్నూరు ప్రమీలను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు ఉన్నారు.

– గుర్ల

అవగాహన ర్యాలీ



ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని, రాబోయే రోజుల్లో ఈ నంబరు ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, సంక్షేమ పథకాలు అందిస్తాయని లక్కవరపుకోట తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. కళ్లేంపూడి, కొట్యాడ, తలారి గ్రామాల్లో రైతు అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. రైతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఎల్.విజయ, ఏఓ ఎం.స్వాతికుమారి పాల్గొన్నారు. ప్రతీ రైతుకి విశిష్ట గుర్తింపు సంఖ్య కల్గి వుండాలి. కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి, ఉత్తరాపల్లి గ్రామాల్లో ఏఓ మాధురీశరణ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

– లక్కవరపుకోట/కొత్తవలస

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. గంట్యాడ మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ డి.ఉమాభారతి, వెలుగు ఏపీఎం సులోచనదేవి, ఎంఈఓ విజయకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, పీఎం పాలెం, గంట్యా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పల్లవి, డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

– గంట్యాడ

పోలీస్ సిబ్బందికి సన్మానం



చీపురుపల్లి శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి జాతరలో సక్రమంగా బందోబస్తు నిర్వహించి సేవలందించిన పోలీస్ సిబ్బందికి గురువారం సన్మానం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో డీఎస్పీ ఎస్.రాఘువులు చేతుల మీదుగా పోలీస్ బందోబస్తు నిర్వహించిన వారికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరలో ఎలాంటి అల్లర్లు లేకుండా పటిష్టంగా బందోబస్తు చేస్తూ తమ వంతు బాధ్యతగా విధులు నిర్వహించిన వారందరినీ ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో సీఐ శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు పాల్గొన్నారు.

– చీపురుపల్లి రూరల్